

గతేడాది జూలై మొదటి వారంలోనే తీలేరు పంప్ హౌజ్ నుంచి కోయిల్‌సాగర్‌కు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

### నాడు జలకళ..
# నేడు వెలవెల

కేసీఆర్ సర్కారు హయాంలో జూరాలకు వరద వచ్చిందంటే ఉంద్యాల స్టేజ్-1 పంప్‌హౌజ్ నుంచి తీలేరు పంప్‌హౌజ్‌కు నీటిని విడుదల చేసేవారు. గతేడాది ఇదే సమయంలో కోయిల్‌సాగర్‌కు కృష్ణమ్మ గలగలా పారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జూరాలకు భారీ వరద వస్తున్నా.. గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినా.. కరెంట్ సమస్య సాకుగా చూపుతూ అటు ఉంద్యాల వద్ద, ఇటు తీలేరు వద్ద ఉన్న మోటర్ల ద్వారా కోయిల్‌సాగర్‌కు నీటి పంపింగ్‌ను నిలిపేసింది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంపింగ్ ప్రారంభించాలని కోరుతున్నారు.

*- మరికల్, జూలై 28*



ప్రస్తుతం తీలేరు పంప్‌హౌజ్ వద్ద కృష్ణమ్మ పరుగులు లేక బోసిపోయిన మోటర్లు



నేడు ప్రపంచ పులుల దినోత్సవం

# నల్లమల పులుల ఖిల్లా

- పులులకు ఆవాసంగా మారిన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్
- దేశంలోని 55 అడవుల్లో ఆరో స్థానంలో 'ఏటీఆర్'
- 40 పులులు ఉన్నట్లు అధికారుల గుర్తింపు
- కొల్లాపూర్ రేంజ్ పరిధిలోనే పది..

**కొల్లాపూర్, జూలై 28 : నల్లమల అభయారణ్యం వన్యప్రాణులు, సకల జీవరాశులు, ఔషధాలు, సకల ఖనిజాలకు పుట్టినిల్లులాంటిది. రాష్ట్రంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్ట్‌కు ప్రపంచ అడవుల జాబితాలో ప్రత్యేక స్థానం ఉన్నది. నేడు ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా నల్లమల పులుల ఉనికిపై కథనం..**

భారతదేశంలోని 55 టైగర్ రిజర్వ్ ఫారెస్టుల్లో అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ ఆరో స్థానంలో ఉన్నది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ రేంజ్ పరిధిలోనూ అడవి విస్తరించింది. 36వేల హెక్టార్లలో ఉన్న నల్లమల అభయారణ్యంలో అనేక జీవరాశులు ఉన్నాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో పులుల గ్రేడింగ్‌లో ప్రత్యేక స్థానం ఉంది. కోర్ ఏరియాలో ఇది రెండో అతిపెద్ద టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఇందులో పులుల రక్షిత ఆవాస కేంద్రంగా పరిగణించబడింది. మార్చి 2024 నాటికి దేశంలో 3,682 అడవి పులులు ఉన్నాయి. 2,611.4 చదరపు కిలోమీటర్లు విస్తరించిన అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో పులుల సంరక్షణ కోసం ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అమ్రాబాద్ ఫారెస్ట్ పరిధిలో పర్యావరణ పరిరక్షణతోపాటు వన్యప్రాణులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 1983లో అభయారణ్యంగా మారిన నల్లమల టెర్మినలియా టొమెంటోసా, హార్డ్‌వికియా బినాటా, మధుకాలాటిఫోలియా, డయోస్పైరోస్ మెలకోక్సిలాన్, గార్డెనియా మొక్కలు విస్తారంగా ఉన్నాయి.

***పులుల కోసం మాంసాహార జంతువులు..***

పులి ఆహార అలవాటులో వేట ప్రధాన ప్రత్యేకత అని చెప్పొచ్చు. పులులు తన సంతానాన్ని పోషించుకునేందుకు తగినంత ఆహారం లభించే విశాలమైన ఆవాస ప్రాంతాలు అవసరమవుతాయి. పులులకు కావాల్సిన ఆహారంతోపాటు విశాలమైన ఆవాస ప్రదేశం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో ఉండడం మూలంగా ఇతర ఫారెస్టుల నుంచి కూడా పులులు వలసలు వస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. నల్లమల అభయారణ్యాన్ని రెండు పాయలుగా వెళ్లే కృష్ణానది మూలంగా జీవరాశులకు తాగునీటి కొరత కూడా లేదు. పులులు వేటాడేందుకు జింకలు, అడవి పందులు, దుప్పులు లాం టివి పుష్కలంగా ఉన్నాయి. మాంసాహార జంతువుల ఉత్పత్తి కోసం అటవీశాఖ అధికారులు ప్రత్యేకంగా గడ్డి మొక్కలను పెంచుతున్నారు. ఏటా గ్రాస్‌ను పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ చేస్తున్నారు.

### పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ పులులకు నిలయంగా ఉన్నది. కొల్లాపూర్ రేంజ్ పరిధిలో 10 పులుల దాకా ఉన్నాయి. వీటి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వర్షాకాలంలో మాంసాహార జంతువుల ఉత్పత్తి కోసం గ్రాస్ పెంచేందుకు కృషి చేస్తున్నాం. అడవిలోకి అనుమతి లేకుండా వెళ్లిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ పులులు ఉత్పత్తికి తోడ్పాటందిస్తున్నాం. అడవిలో మనుషుల అలజడిని పూర్తిగా నివారించడంతోనే వాటి ఆవాసాల్లో జంతువుల సంఖ్య పెరుగుతోంది. దేశంలోనే పులుల సంరక్షణ కేంద్రాల్లో అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు ఉన్నత స్థానంలో ఉంది.

*- శరత్‌చంద్రారెడ్డి, కొల్లాపూర్ ఫారెస్టు రేంజర్*

### పెరిగిన పులుల సంఖ్య

అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలో పులుల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో దాదాపు 40 పులులు ఉంటే కొల్లాపూర్ రేంజ్ పరిధిలోనే 10 పెద్ద పులులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఒకటి, రెండు పులులు ఉంటే అద్భుతంగా భావించే సందర్భం నుంచి కొల్లాపూర్ రేంజ్ పరిధిలోనే పది పులులు ఉన్నాయి అంటే పులులకు రక్షిత ఆవాస కేంద్రంగా కొల్లాపూర్ రేంజ్ పరిధి ఉన్నది అర్థం. గతంలో కొల్లాపూర్ రేంజ్ పరిధిలో అక్రమ కలప పెద్ద ఎత్తున తరలిపోయేది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ మూలంగా అక్రమ కలప పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పెద్దపులుల సంఖ్యతోపాటు 250 దాకా చిరుత పులుల సంఖ్య పెరిగింది. ఇప్పుడు అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు పులుల గాండ్రిపులతో పర్యావరణ పరిరక్షణ సంపూర్ణంగా రక్షించబడుతోంది. అంతరించిపోతున్న జాతిలో ఉన్న పులుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని జంతు ప్రేమికులు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

## సమాజ హితం కోరేది సాహిత్యం

- రిఫ్లెక్షన్స్ పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, జూలై 28 : సాహిత్యం సమాజహితాన్ని, సామాజిక ప్రయోజనాన్ని కోరుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో కవి, రచయిత నాగవరం బాల్‌రాం రచించిన రిఫ్లెక్షన్స్ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితోపాటు మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ సాహిత్యం ఒక దేశ సంస్కృతిని ప్రతిబింబింపజేయడమేగాక మానసిక వికాసం, పరిణితిని కలిగిస్తుందని గుర్తు చేశారు. నాగవరం బాల్‌రాం 50 ఏండ్లు తమ సాహిత్య జీవితంలో మనిషికి, సమాజానికి సంబంధించిన అనేక అంశాలను వివిధ కోణాల్లో విశ్లేషించి కవితలు రాశారన్నారు. సమాజంలో వివాదాలు, వివక్షలు లేకుండా ప్రశాంతంగా ఉండేలా మనిషి ఎదగాలనేది తన ఆకాంక్ష అని అన్నారు. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత జీవితంలో, సాహిత్య జీవితంలో నాగవరం బాల్‌రాం అజాత శత్రువుగా ముందుకు సాగుతున్నారని కొనియాడారు. రిఫ్లెక్షన్స్ కవితలు నేటి తరం చదవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, అందుకు ఆ పుస్తకాలు జిల్లాలోని ప్రతి పాఠశాలకు అందజేసేలా తాను ఆర్థిక సాయం చేస్తానని పేర్కొన్నారు. అనంతరం మాజీ మంత్రి, మాజీ ఎంపీ, నిర్వాహకులు కవి, రచయిత బాల్‌రాంను పూలమాల, శాలువా కప్పి జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రముఖ వైద్యులు భూపేశ్‌కుమార్, సత్తార్, చిన్న రాములు, కౌన్సిలర్లు వాకిటి శ్రీధర్, నాగన్న, గులాం ఖాదర్, సాహితీవేత్తలు కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, వనపట్ల సుబ్బయ్య, డాక్టర్ వీరయ్య, బైరోజు చంద్రశేఖర్, నారాయణరెడ్డి, బండారు శ్రీనివాసులు, వాహిద్‌ఖాన్, మద్దిలేటి, శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.




రిఫ్లెక్షన్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల

# పేరు మార్చారు.. బిల్లులు మరిచారు

- 'మన ఊరు-మనబడి' పథకంపై నీలినీడలు
- ముందుకు సాగని పనులు.. సందిగ్ధంలో కాంట్రాక్టర్లు
- మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.16 కోట్ల నిధులు పెండింగ్



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బేసిక్ ప్రాక్టిసింగ్ ఉన్నత పాఠశాలలో తుది దశలో ఉన్న డైనింగ్ హాల్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 28 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయి విద్యా సౌకర్యాలు కల్పించాలన్న సంకల్పంతో 'మన ఊరు -మన బడి' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. ఈ పథకం కొనసాగింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నీలినీడలు కమ్ముకుంటున్నాయి. జిల్లాలో రూ.16 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, డైనింగ్‌హాల్, తాగునీరు, విద్యుత్, మేజర్, మైనర్ రిపేర్లు ఇలా మొత్తం పన్నెండు రకాల పనులను చేపట్టాలన్నది అప్పటి ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు రూ.కోట్ల నిధులు కేటాయించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరాక పనులు పూర్తిగా పడకేశాయి. జిల్లాలో 291 పాఠశాలలను మొదటి విడుతలో వివిధ రకాల పనులకు ఈ కార్యక్రమం కింద ఎంపిక చేశారు. ఇందుకుగానూ రూ.125 కోట్ల ప్రతిపాదనలతో పలు పాఠశాలల్లో మౌలిక వసతులు, బ్లాక్‌బోర్డుల స్థానంలో గ్రీన్ బోర్డులు, ఆధునిక వసతులతో కూడిన భోజనశాల, డ్యూయల్ డెస్కులు, మరుగుదొడ్లు వంటివి కల్పించాలన్న లక్ష్యంతో అధికారులు ముందుకు సాగారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లుల విడుదలలో జాప్యం చేయడంతో పనులు ముందుకు సాగక చతికిలబడ్డాయి.



బేసిక్ ప్రాక్టిసింగ్ ఉన్నత పాఠశాలలోని కిచెన్‌షెడ్డు

చాలా చోట్ల ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కొన్నిచోట్ల తరగతి గదులు కూల్చివేయడం.. కొత్తవి పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

***తక్కువ ఖర్చు పనులకే ప్రాధాన్యం..***

మన ఊరు-మన బడి కార్యక్రమం కింద కేసీఆర్ సర్కారు చేపట్టిన పనుల కొనసాగింపుపై కాంగ్రెస్ ఎటువంటి స్పష్టత ఇవ్వడం లేదు. కొత్తగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతో జిల్లావ్యాప్తంగా 130 పాఠశాలల్లో తాగునీరు, మైనర్ రిపేర్లు, నిర్వహణలేక నిరుపయోగంగా మారిన మూత్రశాలలు, మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావడం, విద్యుత్, బాలికలకు కొత్తగా టాయ్‌లెట్ల నిర్మాణం వంటి తక్కువ ఖర్చుతో చేపట్టే పనులు మాత్రమే చేపడుతున్నారు.

***పనుల పురోగతి, నిధుల విడుదల ఇలా..***

మన ఊరు-మన బడి కార్యక్రమం కింద పనులు పూర్తైన 53 పాఠశాలలు ప్రారంభించారు. 37పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. 111పాఠశాలల్లో పేయింటింగ్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన చోట్లా పిల్లర్ల దశలో కొన్ని, పునాది స్థాయిలో, స్లాబ్ నిర్మాణాలు, రంగులు వేసే పనులు కొనసాగుతున్నాయి. సివిల్ పనులకు సంబంధించి రూ.70 కోట్ల పనుల ప్రతిపాదనలకు గానూ ఇప్పటి వరకు రూ.23.5 కోట్లు మాత్రమే చెల్లించారు. పూర్తైన పనులకు సంబంధించి అధికారికంగా ఎంబీ రికార్డులు పూర్తైన రూ.16 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ పనులు పూర్తైనా బిల్లులు రాకపోవడంతో నిధుల మంజూరు కోసం కాంట్రాక్టర్లు వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు.

### నిధుల సమస్యల ఉన్నది..



మన ఊరు-మన బడిలో మౌలిక వసతుల పనులు చాలా వరకు పూర్తయ్యాయి. మిగులు పనులు కొనసాగిస్తాం. పనిచేసే కాంట్రాక్టర్లకు నిధులు చెల్లించే బాధ్యత ప్రభుత్వానిది. నిధులు పెండింగ్ ఉన్నది వాస్తవమే. బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే చెల్లిస్తాం.

*- రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్*

## గర్భిణి మృతి : బంధువుల ఆందోళన

- డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపణ



అంబులెన్స్ నిలిపి ఆందోళన చేస్తున్న బంధువులు

పెబ్బేరు, జూలై 28 : పెబ్బేరు పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖాన వైద్యుల నిర్లక్ష్యం మూలంగా గర్భిణి మహిళ మరణించిందని మృతురాలి బంధువులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మృతురాలి తల్లి సావిత్రి కథనం మేరకు.. శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లెకు చెందిన పుష్పలత (22) నాలుగు నెలల గర్భిణి. ప్రతి నెలా పెబ్బేరులోని ఓ ప్రైవేట్ దవాఖానలో పరీక్షలు చేయించుకుంటున్నది. ఈ క్రమంలోనే శనివారం ఆరోగ్యం ఆందోళనకరంగా ఉండడంతో దవాఖానకు తీసుకొచ్చారు. ఆ సమయంలో డాక్టర్ లేనప్పటికీ సిబ్బంది వైద్యం అందించారు. పరిస్థితి విషమంగా మారడంతో డాక్టర్ వచ్చి మెరుగైన చికిత్స కోసం గర్భిణిని కర్నూల్‌కు తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే వారు అంబులెన్స్‌లో తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. పెబ్బేరులోనే సమయానికి డాక్టర్ వైద్యం చేసి ఉంటే తమ బిడ్డ బతికేదని.., ఇక్కడ మరణించాకే తమను తప్పుదోవ పట్టించి కర్నూల్‌కు పంపారని మృతురాలి తల్లి సావిత్రమ్మ వాపోయింది. కాగా, ఈ ఘటనలో పెబ్బేరు పోలీసులు అత్యుత్సాహం చూపినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. శవాన్ని తాము కర్నూల్ నుంచి తీసుకొస్తుంటే పెబ్బేరు బైపాస్ రోడ్డుపై అడ్డగించారని పేర్కొన్నారు. దీంతో శవం ఉన్న అంబులెన్స్‌ను వారు రోడ్డు మీదే ఉంచి ఆందోళన చేపట్టారు. చివరికి బాధితులను, దవాఖాన సిబ్బందిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. మృతురాలి తల్లి మదుగని సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

## బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

వెల్దండ, జూలై 28 : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో వెల్దండ పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయం వెల్దండ మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరితో పాటు నాయకులు గుత్తి బాలకృష్ణ, ఈదులపల్లి శ్రీను ఇతర నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మంచి పనులే చేస్తే మమ్మల్ని అరెస్ట్ చేసే అవసరమేమిటని ప్రశ్నించారు. అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు.



వెల్దండలో బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసిన పోలీసులు

# ఉప్పొంగిన కృష్ణమ్మ

- జూరాలకు 3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 41 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- నేడు శ్రీశైలం గేట్ల ఎత్తివేత
- టీబీ డ్యాంకు 1.46 లక్షల క్యూసెక్కుల రాక



జూరాల గేట్ల నుంచి దిగువకు పారుతున్న వరద

గద్వాల, జూలై 28 : ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద పోటెత్తుతుండడంతో కృష్ణమ్మ ఉప్పొంగి ఉరకలేస్తున్నది. ఆదివారం ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి జూరాల ప్రాజెక్టుకు 3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా.. 41 గేట్లు ఎత్తి దిగువకు 2,75,538 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాలలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది. ఆనకట్ట గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ శ్రీశైలం వైపు పరుగెడుతున్నది. జూరాల పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 317.670 మీటర్లు ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 7.971 టీఎంసీలుగా నమోదైంది. జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుదుత్పత్తికి 18,922, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 750, భీమా లిఫ్ట్‌కు-1కు 1,300, భీమా లిఫ్ట్-2కు 750, జూరాల ఎడమ కాల్వకు 820, కుడి కాల్వకు 578, సమాంతర కాల్వకు 600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు నుంచి 2,98,866 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.



సుంకేసుల గేట్ల నుంచి శ్రీశైలానికి వరద పరుగులు

***తుంగభద్రకు భారీ వరద***

అయిజ, జూలై 28 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు 1,46,268 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 33 గేట్లను ఎత్తారు. 105.788 టీఎంసీల సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 97.715 టీఎంసీల నిల్వ ఉన్నది. 1633 అడుగులకు గానూ 1630.96 అడుగులు ఉన్నట్లు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

***ఆర్డీఎస్ ఆనకట్టకు జలకళ..***

కర్ణాటకలోని టీబీ డ్యాం నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో ఆర్డీఎస్ జలకళను సంతరించుకున్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు 1,30,000 క్యూసెక్కులు ఇన్ ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 1,29,350 క్యూసెక్కుల వరద నీరు సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. అదేవిధంగా ఆయకట్టుకు 650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆనకట్టలో 13.8 అడుగుల నీటిమట్టం ఉంది.

***ఆల్మట్టి, నారాయణపూర్‌కు పోటెత్తిన వరద..***

కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 2,68,222 క్యూసెక్కులు చేరుతుండగా, అవుట్‌ఫ్లో 3,25,000 క్యూ సెక్కులుగా ఉన్నది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటినిల్వ 129.72 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 69.664 టీఎంసీలు ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3,20,000 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 3,27,366 క్యూసెక్కులుగా ఉన్నది. ప్రస్తుతం 24.489 టీఎంసీలుగా ఉన్నది.

***సుంకేసుల డ్యాం 28 గేట్లు ఎత్తివేత***

రాజోళి, జూలై 28 : మండలంలోని సుంకేసుల డ్యాంకు ఆదివారం సాయంత్రం వరకు 1,49,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా.. 28 గేట్లు ఎత్తి 1,46,760 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. డ్యాం నీటి సామర్థ్యం 1.23 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 0.438 నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కేసీ కెనాల్‌కు 1540 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

***శ్రీశైలం జలాశయానికి..***

శ్రీశైలం, జూలై 28 : శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తుండడంతో మంగళవారం గేట్లు ఎత్తేందుకు అధికారులు నిర్ణయించారు. అయితే, ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి 3,73,942 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. పూర్తిస్థాయి నీటినిల్వ 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 159.7646 టీఎంసీలుగా ఉన్నది. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుదుత్పత్తి చేస్తూ 61,038 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ఇలాగే కొనసాగితే రేపు రాత్రికి శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయిలో నిండనున్నది.



## నిర్లక్ష్యపు 'తీగలు'

- విద్యుత్ స్తంభం, వైర్లను చుట్టేసిన తీగచెట్టు

నాగర్‌కర్నూల్, జూలై 28 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఓ చెట్టు తీగ చుట్టేసింది. రాఘవేంద్ర కాలనీలోని మాంగళ్య షాపింగ్ మాల్ సమీపంలో ప్రధాన రహదారి పక్కనున్న కరెంట్ స్తంభంపైకి తీగ అల్లుకున్నది. మెల్లమెల్లగా పెరుగుతూ స్తంభంతోపాటు విద్యుత్ వైర్లను పూర్తిగా కమ్ముకున్నది. దీంతో ప్రమాదం పొంచి ఉన్నా.. అధికారులు మాత్రం స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## నిరుపయోగంగా 104 వాహనాలు




బిజినేపల్లి, జూలై 28 : మండలంలోని పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 104 వాహనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. వీటిని వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ వాహనాలను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం 104 అంబులెన్స్‌లు దవాఖాన ఆవరణలో దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా కావడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యసేవలు అందకుండాపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి 104 ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.